


# కారులో షికారు

నా జాతకం చాలా మంచిదనేవారు తాతగారు. చిన్నతనంనించీ వాహనయోగం వుంది. నాకు బుద్ధి తెలిసేసరికి పాతకాలం ఫోర్డుకారు ఉండేది మా నాన్నగారి దగ్గర. పన్నెండొందలు పెట్టి కొన్నారుట.

ఎందుకిది? ఈ డబ్బుకి బోలెడంత బంగారం వచ్చేది అని సణిగింది మా అమ్మ. ఇంట్లో కూర్చునే అమ్మకేం తెలుసు కారు విలువ?

మా స్కూల్లో అందరూ వీళ్ళకి చిన్నకారుంది అని గొప్పగా చెప్పుకునేవారు. చండశాసనుడూ మా లెక్కల మాష్టారు... నేను లెక్కలు తప్పుచేసినా ఏమీ అనేవారు కాదు. క్లాసు లీడరునుకూడా ఎప్పుడూ నేనే. మరి ఇదంతా కారు ఉండడంవల్లే కదా!

అప్పుడప్పుడూ మా కార్లో మా తాతగారి ఊరికి వెళ్ళేవాళ్ళం. దార్లో ఏదో జాడ్యంవచ్చి ఆగిపోయేది. కార్లో రిపేరు సామాగ్రి సిద్ధంగా ఉండేది. మా నాన్నగారు కారు కింద పడుకుని రిపేరు చేసేవారు. అలా అంచెలంచెలుగా గమ్యం చేరేవాళ్ళం.

ఊరు అంతదూరం ఉండగానే చుట్టుపక్కల చేలల్లో పనిచేస్తున్న జనం మా కారు చూసి 'కరణంగారి అల్లుడుగారి కారొచ్చింది' అని పరుగున వచ్చేవాళ్ళు. 'తోసేస్తాం

తోసేస్తాం' అని కారుని తోసుకుంటూ ఊళ్ళోకి తీసుకొచ్చేవాళ్ళు. ఇంటికి జేర్చి 'అమ్మాయిగారూ! పదిరోజులుంటారుగా' అని అడిగేవాళ్ళు. 'లేదు. సోమవారం వెళ్ళిపోతా' అనేది అమ్మ. 'సరే అయితే సోమవారం వస్తాం, కారు తోసేస్తాం' అని హామీ ఇచ్చి వెళ్ళేవారు.

అమ్మమ్మ లోపలినుంచి ఇంత మొహం చేసుకుని వచ్చేది. 'వచ్చారా! ఇంత ఆలస్యమైతే దార్లో కారాగిపోయి ఉంటుంది అనుకున్నాను' అని ఆదరంగా తీసుకువెళ్ళేది.

"అల్లుడుగారూ! కారు ట్రబుల్ ఇచ్చిందా?" అని అడిగేవారు తాతగారు

"అం లేదండీ! కాకపోతే పొన్నూరు దాటాక ఒకసారి, లాకులదగ్గర ఒకసారి, చందోలు మలుపులో ఒకసారీ ఆగింది. బాగుచేశాను. బస్టాండుకి అంతదూరంలో ఉండగా మళ్ళీ అనుమానం వచ్చింది. మనవాళ్ళంతా వచ్చి తలో చెయ్యీ వేశారు" అనేవారు నాన్నగారు.

"మన ప్రాంతాలకు వస్తే ఢోకాలేదు. మన బలగం ఉందిగా. మీరు వెళ్ళేరోజు ఒకగంట ముందుగా చెప్తే వచ్చి వాలిపోతారు" అనేవారు తాతగారు.

ఎందుకండీ? అది నడుస్తూనే వుందిగా అంటే-

"మనిషి సాయం లేనిచోట దానికెలాగూ తప్పదు పాపం, మనుషులున్న చోటైనా విశ్రాంతి తీస్కోనివ్వండి" అనేవారు తాతగారు.

శని, ఆదివారాలు ఉండి తిరుగుప్రయాణం అయ్యేవాళ్ళం. మామూలుగా చేయించిన భారీ పిండివంటలతోబాటు అడుగూబొడుగూ మిగిలిన నాలుగు కజ్జికాయలూ, రెండు గారెముక్కలూ కూడా బాదం ఆకుల్లో పొట్లం కట్టేది అమ్మమ్మ.

'ఎందుకే అవన్నీ' అని అమ్మ అంటే- 'ఉండనీ. కారాగిపోయినప్పుడు పిల్లలు నోట్లో వేసుకుంటారు' అనేది.

ఎక్కడికి వెళ్ళినా మధ్యలో కారాగిపోవడం మా అమ్మకు చిరాగ్గా ఉండేది. కానీ మాకు మాత్రం సరదాగానే ఉండేది. చేల వెంబడి పరుగులు తియ్యొచ్చు. పిల్లకాలువ ఉంటే ఆడుకోవచ్చు. రాళ్ళువేసి చింతకాయలు కొట్టుకోవచ్చు.

ఒకసారి సెలవుల్లో తిరుపతి ప్రయాణం పెట్టుకున్నాం. తాతయ్యగారు రాలేనన్నారుట... అమ్మమ్మ మాత్రం వచ్చింది. బోలెడన్ని చిరుతిళ్లు మూటలు కట్టి 'కారాగిపోయినప్పుడు తిందాం' అంది సరదాగా.

దూరాభారం మా కారులో ప్రయాణం కష్టం అవుతుందని టాక్సీ మాట్లాడారు. తెల్లగా రాజహంసలా ఉంది అంబాసిడర్ టాక్సీ.

పెందలాడే భోజనాలుచేసి బయలుదేరాం.

రివ్వున దూసుకుపోతోంది టాక్సీ. కాసేపటికి మాకు విసుగేసింది. 'నాన్నగారూ కారెపుడాగిపోతుంది?' అని అడిగాం.

'నోళ్లు ముయ్యండి అపశకున పక్షుల్లారా' అని తిట్టింది అమ్మ.

మరికాసేపటికి అమ్మమ్మకీ విసుగువేసింది. 'బాబూ! కారెప్పుడు ఆగిపోతుందో నాన్నగారిని అడుగు' అంది మా అన్నయ్యతో. ఆవిడ నేరుగా అల్లుడితో మాట్లాడదు మరి!

"ఇదెక్కడి గొడవే! కావాలంటే చెప్పండి ఆపుతారు. అంతేగానీ ఆగిపోదేం, ఆగిపోదేం అంటే ఇదేమైనా మన డొక్కుకారా? బోలెడు డబ్బుపోసి తెచ్చిన టాక్సీ" అని కసిరింది అమ్మ.

ప్రయాణం బాగానే జరిగింది. ఇంటికి తిరిగివచ్చాం. అమ్మ సంతోషంగా ఉంది. మాకూ, మా అమ్మమ్మకు మాత్రం అసంతృప్తిగా ఉంది. ఆ టాక్సీ వ్యవహారం మాకు నచ్చలేదు.

"అదేం పీడాకారం. బయలుదేరితే ఇహ అదే పరుగా! నిలుపూ నిదానం ఉండద్దూ? మనకారు బంగారం. ఒకసారి రోడ్డుమీద కారాగిపోతే అల్లుడుగారు రిపేరు చేసేలోపల అడ్డదోవన గోవాడ వెళ్ళి మా పినతండ్రి కూతుర్ని చూసొచ్చాను. విడిగా వెళ్ళాలంటే కుదుర్తుందా? ఇంకోసారి చక్కగా మిరపచేను పక్కన ఆగిపోయింది. దిగి మేలైన మిరపకాయలు చవగ్గా కొనుక్కున్నాం. ఎంతైనా మన కారుకి మన వీలూ వివరం తెలుస్తాయిగానీ పరాయి కారుకేం తెలుస్తాయి? డబ్బు పోసినంత మాత్రాన విశ్వాసం ఉంటుందా" అంది అమ్మమ్మ.

నిజమే, ఇక పరాయి కారుల్లో ప్రయాణం చెయ్యకూడదని గట్టిగా తీర్మానించుకున్నాం.

ఆ రోజుల్లోనే మా నాన్నగారికి ప్రమోషనొచ్చి బాపట్ల ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇక తాతగారు అమ్మమ్మల ఆనందం చెప్పనలవికాదు. కూతురు కూతవేటుదూరంలో ఉంటుందంటే ఆనందం కాదామరి!

బాపట్ల వచ్చాక మరోసారి ఊరు వెళ్లాం. మామూలుగానే మంచినీళ్ళ బావిదగ్గర ఆగిపోతే అక్కడున్న ఆడంగులే తోసుకొచ్చేశారు.

నాన్నగారు రిపేరు చేసినా బాగుపడలేదు. ఆయన వెళ్ళి ఒక లారీనీ అదనంగా మరో డ్రైవరునీ పంపించారు. ప్రయాణం అయ్యాం.

భావనారాయణ స్వామి దర్శనం చేసుకుంటానని అమ్మమ్మ కూడా మాతో బయలుదేరింది. సావిట్లో గుంజకి తగిలించిన మోకులు తెచ్చి లారీకీ-కారుకీ కట్టారు. లారీ కదిలింది... దానివెంటే కారు.

"మరి యజమానికి పదోన్నతి వస్తే వాహనానికి రాదా! ఈ దర్జా చూడు, చక్కగా పూలవాడలో ఊరేగుతున్నట్లు ఉంది" అంది అమ్మమ్మ మహదానందంతో. అమ్మ పళ్ళు కొరుక్కుంది.

అందరం, ఆ కార్తీకమాసంలో సంగం జాగర్లమూడి వెళ్ళాం మా కార్లోనే. షరా మామూలే. వెంటనున్న మనిషి రోడ్డుమీదకి వెళ్ళి బస్సుద్వారా కబురు పంపించాడు. మా స్నానాలూ, దర్శనాలూ, భోజనాలూ అయ్యేసరికి ఖాళీ లారీ వచ్చేసింది. మెకానిక్కు డ్రైవరూ దిగారు. కాసేపు తర్జనభర్జనలు పడి చెక్కలు వేసి కారుని లారీలోకి ఎక్కించారు. మేము కార్లోనే ఉన్నాం.

అమ్మమ్మ ఆనందం వర్ణనాతీతం. దారంతా ఏఏఏ అని చేతులూపుతున్న పిల్లలకు తనూ చేతులూపి సమాధానం చెప్పింది.

"అమ్మాయ్! మనకారు హోదా రోజురోజుకీ పెరిగిపోతుందే. దిష్టి తగుల్తుందేమో అని భయంగా ఉంది" అంది.

"చాల్లే వెధవవాగుడు. అందరం ఇట్లాగే మంగళగిరి వెళ్ళి కొండమీదనుండి కిందకు దూకుదాం! పీడా విరగడవుతుంది" అంది అమ్మ ముక్కు చీదుకుంటూ.

ఇంటికి చేరాక అమ్మ లేకుండా చూసి- "ఏమన్నానని నామీద విరుచుకు పడుతోంది మీ అమ్మ?" అని అడిగింది.

"మన కారుని చూసి దారంతా ఎగతాళిగా నవ్వారు కదా, అదిచూసి అమ్మ చిన్నబుచ్చుకుంది" అని చెప్పాను.

"ఎవడా నవ్వేది? మన కారు, మనిష్టం. లారీ కాకపోతే విమానంమీద ఎక్కించి తిప్పుకుంటాం. వాళ్ళకేం కష్టం వచ్చిందిట. ఇటు రమ్మను. మాడు పగలగొడతాను" అంది ప్రేమగా చీరకొంగుతో కారును తుడుస్తూ.

* * *